# అభివృద్ధిని చూసి ఓటేయండి



వెంకటాద్రినగర్ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ మలక్‌పేట ఎమ్మెల్యే అభ్యర్థి తీగల అజిత్ రెడ్డి



డీఏస్ నగర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న యాకుత్‌పుర బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సామ సుందర్ రెడ్డి

సైదాబాద్, నవంబర్ 21 : ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తే మలక్‌పేటను అభివృద్ధి చేస్తానని మలక్‌పేట బీఆర్ఎస్ అభ్యర్థి తీగల అజిత్ రెడ్డి అన్నారు. మంగళవారం సైదాబాద్ డివిజన్ పరిధిలోని తిరుమల హిల్స్, రెవెన్యూ బోర్డు కాలనీ, వెంకట్రాదినగర్, మాధవ నగర్, బ్రహ్మానందరెడ్డి నగర్ కాలనీ, ఆస్మాన్‌ఘడ్ ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తీగల అజిత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఒక్కసారి తమకు అవకాశం కల్పించాలంటూ ప్రజలను బురిడీ కొట్టించే ప్రయత్నం చేస్తున్నారని, నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. సీఎం కేసీఆర్ తొమ్మిదేండ్లలోనే అభివృద్ధి చేసి చూపించారని చెప్పారు. సీఎం కేసీఆర్ కృషితో కోట్లాది నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొరుడు భూమేశ్వర్, సైదాబాద్, మూసారాంబాగ్ మాజీ కార్పొరేటర్లు సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి, తీగల సునరితా రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ రాధ, సైదాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పగిళ్ల శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ మాజీ అధ్యక్షుడు కావేటి ధర్మరాజ్, ఫైబర్‌టెల్ బీఎన్ రాజు, సునీత్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణాకూర్, సుభాష్ కాటేకర్, కృష్ణ, మల్లేశ్, రమేశ్, దేవసారి కృష్ణ, నర్సింగ్, మోహన్ రాజు, నందు పాల్గొన్నారు.

### రెండు పార్టీలు ప్రజలను మోసం చేస్తాయి

సైదాబాద్, నవంబర్ 21 : ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చగొట్టి ఓట్లను దండుకోవాలని బీజేపీ నాయకులు చూస్తున్నారని యాకుత్‌పుర బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సామ సుందర్ రెడ్డి అన్నారు. ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని డీఏస్ నగర్, వడ్డెరబస్తీ, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ, పూర్ణోదయ కాలనీ, వాణీనగర్, వినయ్‌నగర్ కాలనీ, మనోహర్‌నగర్ కాలనీల్లో ఇంటింటి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు కాంగ్రెస్ నాయకులు ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేయటానికి కుట్రలు చేస్తున్నారని ఆయన అన్నారు. ఐఎస్ సదన్‌లో తాము కార్పొరేటర్‌గా చేసిన అభివృద్ధి పనులే కన్పిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఐఎస్ సదన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్నాసుందర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు మెట్టు భాస్కర్ రెడ్డి, కార్తిక్, శివ పాల్గొన్నారు.

### మైనార్టీల మద్దతు బీఆర్ఎస్‌కే

చాదర్‌ఘాట్, నవంబర్ 21: ముస్లింలు, మైనార్టీల సంపూర్ణ మద్దతు బీఆర్ఎస్‌కే ఉందని మలక్‌పేట నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి లాయక్ అలీ అన్నారు. అజంపుర డివిజన్‌లోని ముస్లిం సోదరులను కలిసి బీఆర్ఎస్ అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డిని గెలిపించేందుకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మీర్ అబ్బాస్, మాలిక్ పాల్గొన్నారు.



బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడికి బీఆర్ఎస్‌కి ఓటు వేయాలని కరపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ మలక్‌పేట ఎమ్మెల్యే అభ్యర్థి తీగల అజిత్ రెడ్డి



తీగల అజిత్‌రెడ్డిని గెలిపించాలని, కారు గుర్తుపై ఓటు వేయాలని ఓటర్లను కోరుతున్న లాయక్ అలీ

## ఆదరించి గెలిపిస్తే సేవకుడిలా పనిచేస్తా



బసితీయ మసీదు వీధిలో ఎంఐఎం మలక్‌పేట అభ్యర్థి అహ్మద్ బలాలకు ఓటేసి గెలిపించాలని మహిళను కోరుతున్న హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

మలక్‌పేట, నవంబర్ 21 : పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోరుకునే పార్టీ ఎంఐఎం అని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. పాత మలక్‌పేట డివిజన్‌లోని బసితీయ మసీదు వీధి, సద్దాం హోటల్, హబీబ్ డైరీ ఫాం వీధి, జీహెచ్ఎంసీ కమ్యూనిటీ హాల్ లేన్, గార్డియన్స్ స్కూల్ లేన్, బారీ గల్లీ, ఖరున్నీసా మసీదు వీధి, కరీం మంజిల్ వీధి, జియా ఉల్ హక్ మసీదు వీధుల్లో ఎంఐఎం మలక్‌పేట అభ్యర్థి, ఎమ్మెల్యే అహ్మద్ బలాలతో కలిసి ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ.. బలాల 15 ఏండ్లలో అన్నివిధాలుగా అభివృద్ధి పరిచారని, యువతకు ఉపాధి కల్పించేందుకు ఎనిమిదేండ్లు కృషి చేసి ఐటీ టవర్స్‌ను తేవటం జరిగిందని, రూ.వేయి కోట్లతో ఏర్పాటుచేసే ఈ ఐటీ టవర్స్‌తో అనేక మల్టీ నేషనల్ కంపనీలు మలక్‌పేటకు రానున్నాయని, దాంతో 20 నుంచి 30 వేల యువతకు ఉద్యోగాలు లభించనున్నాయన్నారు. బలాల మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలను తన కుటుంబ సభ్యులుగా భావిస్తానని, వారికి సేవ చేయటం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఐదేండ్లలో మలక్‌పేటను మరో హైటెక్ సిటీగా మారుస్తానని, ఐటీ ఉద్యోగులు ఉద్యోగాల కోసం గచ్చిబౌలి వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. కార్యక్రమంలో పాత మలక్‌పేట డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు షఫీ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మలక్‌పేట నియోజకవర్గం-58లో ప్రారంభమైన ఇంటి నుంచి ఓటేసే ప్రక్రియ

మలక్‌పేట, నవంబర్ 21 : 80 ఏండ్లు దాటి మంచాన పడిన సీనియర్ సిటిజెన్స్, పీడబ్ల్యూడీ ఓటర్లు ఇంటి నుంచి ఓటేసే ప్రక్రియ మలక్‌పేట నియోజకవర్గం – 58లో మంగళవారం నుంచి ప్రారంభమైందని సర్కిల్ – 6 డీసీ జయంత్ తెలిపారు. నియోజకవర్గంలో తొమ్మిది వేల మంది సీనియర్ సిటిజెన్స్, పీడబ్ల్యూడీ ఓటర్లకు నెలరోజుల క్రితమే 12–డీ ఫారాలు పంపిణీ చేయగా, అందులో 75 మంది సీనియర్ సిటిజెన్స్, ముగ్గురు పీడబ్ల్యూడీ ఓటర్లు అందుకు సంసిద్ధతను వ్యక్తంచేస్తూ ఫోన్ చేశారని ఆయన తెలిపారు. మంగళవారం పోలింగ్ అధికారులు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, పోలీసులు వారి ఇండ్లకు వెళ్లగా, 72 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, వారి ఓట్లను సేకరించారని తెలిపారు. మరో ఆరుగురు బుధవారం వారి ఓటు హక్కును వినియోగించుకోనున్నారని, దాంతో బుధవారంతో నియోజకవర్గంలో ఇంటి నుంచి ఓటేసే ప్రక్రియ ముగియనుందని ఆయన తెలిపారు.



మలక్‌పేట నియోజకవర్గంలో 80 ఏండ్లు పైబడి మంచాన పడిన సీనియర్ సిటిజెన్ల నుంచి ఓట్లు సేకరిస్తున్న పోలింగ్ అధికారులు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు

### రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జిగా పీఎల్ శ్రీనివాస్

మణికొండ, నవంబర్ 21 : రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జిగా పీఎల్ శ్రీనివాస్‌ను నియమిస్తూ రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించినట్లు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తెలిపారు. నియోజకవర్గ వ్యవహారాలపై పీఎల్ శ్రీనివాస్ నేతృత్వంలో కార్యక్రమాలను కొనసాగిస్తామని ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు వెల్లడించారు. పార్టీ విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు కార్యకర్తలు ఎక్కడికక్కడా శక్తివంచనలేకుండా పనిచేయాలని శ్రీనివాస్ కోరారు.

### హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

శంషాబాద్ రూరల్, నవంబర్ 21 : మహిళ హత్యకు కారణమైన ఇద్దరు వ్యక్తులకు జీవిత ఖైదు విధించిన ఘటన మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దగోల్కొండకు చెందిన నక్క మంజుల ఆమె భర్త మహేశ్‌ను గతంలో బంధువులు హత్య చేశారు. కాగా మంజుల కుటుంబానికి బంధువులు రూ.3.50 లక్షలు ఇచ్చారు. దీంతో ఆమె కుటుంబ సభ్యులైన అత్త, మామ, మరిది ముగ్గురు ఆమెను డబ్బుల కోసం వేధించడంతో పాటు 2017 లో రాత్రి సమయంలో ఆమె ఇంటికి వెళ్లి ఆమెతో గొడవపడి ఉద్దేశపూర్వకంగా చంపడం కోసం ఒంటిపై కిరోసిన్‌పోసి నిప్పంటించారు. ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకొని చికిత్స నిమిత్తం నగరంలోని ఉస్మానియా దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందారు. దీంతో కేసు నమోదు చేసిన శంషాబాద్ పోలీసులు నిందితులను అరెస్టు చేసి జైలుకు తరలించారు. దీంతో హత్య చేసిన నిందితులు నక్క శంకరమ్మ, రమేశ్‌లకు జిల్లా కోర్టు మంగళవారం జీవిత ఖైదు విధించినట్లు వివరించారు.

### వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 21: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఓయూ దూరవిద్య కేంద్రమైన ప్రొఫెసర్ జి. రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్‌ఆర్‌సీడీఈ) ద్వారా అందించే ఫిలాసఫీ, హిందీ, సైకాలజీ తదితర విభాగాల ఎంఏ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

### వివిధ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 21: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ కోర్సులతో పాటు వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీఎస్‌డబ్ల్యూ, బీబీఏ అనలిటిక్స్, బీబీఏ, బీఎస్సీ, బీకామ్, బీకామ్ ఆనర్స్ తదితర కోర్సుల మూడు, అయిదో సెమిస్టర్ రెగ్యులర్, ఎమ్మెస్సీ అప్లైడ్ న్యూట్రిషన్, ఎమ్మెస్సీ స్పోర్ట్స్ న్యూట్రిషన్ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కెమిస్ట్రీ తొమ్మిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 12 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

### వైస్ చాన్స్‌లర్స్ రీసర్చ్ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 21: ఉస్మానియా యూనివర్సిటీలో వైస్ చాన్స్‌లర్స్ రీసర్చ్ అవార్డ్ – 2024కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. 2022 డిసెంబర్ 1 నుంచి 2023 నవంబర్ 30 వరకు కనపరిచిన ప్రతిభ ఆధారంగా ఈ అవార్డులు ఇవ్వనున్నట్లు చెప్పారు. యూనివర్సిటీ అధ్యాపకులను పరిశోధన, అభివృద్ధి రంగాల్లో ప్రోత్సహించేందుకు వైస్ చాన్స్‌లర్స్ రీసర్చ్ అవార్డును రెండేళ్ల నుంచి ప్రదానం చేస్తున్నారు. ఈ అవార్డు కింద ప్రశంసాపత్రం, ట్రోఫీతో పాటు నగదు బహుమతిని అందజేయనున్నారు. యూనివర్సిటీకి చెందిన రెగ్యులర్ అధ్యాపకులతో పాటు కాంట్రాక్ట్ అధ్యాపకులు సైతం ఈ అవార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. అఫిలియేటెడ్ కళాశాల అధ్యాపకులకు కూడా ఒక అవార్డును అందజేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అధ్యాపకులు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచిన దరఖాస్తును నింపి, సంబంధిత ధృవపత్రాలను జతచేసి వచ్చే నెల 6లోగా యూజీసీ డీన్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. దానితో పాటు దరఖాస్తు పీడీఎఫ్ కాపీని deanugcou<\@>osmania.ac.in, vera. deanu gcou<\@>gmail.com కు ఈ మెయిల్ పంపించాలని అన్నారు. ఇతర వివరాలకు తమ వెబ్‌సైట్‌లో చూసుకోవాలన్నారు.